# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- దక్షిణాది రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీకి ఆదరణ పెరుగుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- రాజకీయ పార్టీలు “కోడ్ ఆఫ్ కండక్ట్”ని పాటిస్తూ ప్రచారాలని నిర్వహించాలని తెలంగాణ ఎలక్షన్ కమీషనర్ వికాస్ రాజ్ తెలిపారు.

- రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి.

- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అన్నారు.

=========================

దక్షిణాది రాష్ట్రాల్లో ఎన్డీయేకు అనుకూలంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈరోజు తెలంగాణాలోని జగిత్యాలలో జరిగిన ‘విజయ సంకల్ప సభ’లో మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర ముగింపు సందర్భంగా నిన్న జరిగిన సభలో రాహుల్ గాంధీ “శక్తి”తో పోరాడుతున్నామని అనటం సబబు కాదని, దేశంలోని ప్రతి మహిళా శక్తి స్వరూపమే అని పేర్కొన్నారు.

=========================

రాజకీయ పార్టీలు కోడ్ ఆఫ్ కండక్ట్ ని పాటిస్తూ ప్రచారాలని నిర్వహించాలు తెలంగాణ ఎలక్షన్ కమీషనర్ వికాస్ రాజ్ పేర్కొన్నారు. ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రభుత్వ వాహనాలను ప్రచారాలకి వినియోగించరాదని, వాటిని రద్దు చేశామని పేర్కొన్నారు. అలాగే రోడ్ షోలు నిర్వహించేందుకు రిటర్నింగ్ అధికారి నుంచి పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. రోడ్ షోలు సెలవలు వున్నా రోజు మాత్రమే నిర్వహించాలని, అదీ జనం ఎక్కువ వున్న చోట ఉండకూడదని, ఆసుపత్రులు దగ్గర లౌడ్ స్పీకర్లు వాడకూడదని పేర్కొంటూ…

(వాయిస్ 46 సెకన్లు)

=========================

రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో పదవ తరగతి పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జీలాని సమూన్ తెలిపారు. పదవ తరగతి పరీక్షల సందర్భంగా ఈ రోజు అరసవిల్లిలోని ఒక ప్రైవేటు స్కూలులో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రతీ పరీక్ష కేంద్రంలో మౌలిక సదుపాయాలతో పాటు వేసవి దృష్ట్యా విద్యార్థినీ విద్యార్థులకు తాగునీరు సదుపాయం, పరీక్షల అనంతరం వారి ప్రాంతాలకు చేరుకునేందుకు ఏ.పి.ఎస్.ఆర్.టి.సి బస్సు సదుపాయం కల్పించామని తెలిపారు.

అన్నమయ్య జిల్లాలో 492 హై స్కూల్స్ లో 22 వేల 466 మంది పదవ తరగతి విద్యార్థులు వున్నారని, 121 సెంటర్లను ఏర్పాటు చేసామని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు.

పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, మాస్ కాపీయింగ్ కు అవకాశం కల్పించ వద్దని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. ఈరోజు రాజ ఒమ్మంగి మండలం జడ్డంగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించాలని, ఎటువంటి అసౌకర్యం కలగనీయరాదని, సరైన లైటింగ్, తాగు నీరు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

=========================

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అన్నారు. ఈరోజు తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలుగు సంవత్సరాల 11 నెలల కాలంలో ప్రభుత్వం పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను తీసుకొచ్చిందన్నారు.

విరామం

=========================

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు అసెంబ్లీ నియోజ వర్గం రిటర్నింగ్ అధికారి వి.అభిషేక్ తెలిపారు. ఈరోజు అరకు లోయ తాహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించి ఎన్నిక ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాలలో ప్రచార కార్యక్రమాలు, పార్కులు, చర్చలు, దేవాలయాలపై గోడ పత్రికలు అతికిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు రవాణా ఇబ్బందులుంటే అధికారులు సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు.

=========================

వై.ఎస్.ఆర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాలతో కమలాపురం నియోజకవర్గంలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు నిర్వహించారు. ఈ మేరకు చెన్నూరు సి.ఐ పార్ధసారధి ఆధ్వర్యంలో ఈరోజు కమలాపురం నియోజకవర్గంలోని సమస్యాత్మక గ్రామాలయిన ఉప్పరపల్లి, కొక్కిరాయిపల్లిలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రశాంత వాతవరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని తెలియజేశారు.

=========================

ఏపీఎస్ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ శ్రీకాకుళంలో 15వ బ్యాచ్ 20వ తేదీన ప్రారంభిస్తున్నట్టు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో డ్రైవింగ్ తో పాటు డ్రైవింగ్ లో మెళుకువలు నేర్పిస్తూ

డ్రైవర్లుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తప్పక హెవీ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కి వెళ్ళినప్పుడు ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ లో ఒకరోజు ట్రైనింగ్ తీసుకుని, సర్టిఫికెట్ ని రవాణా శాఖకు సమర్పించే విధంగా అన్ని ఏర్పాట్లు చేసామని తెలియజేసారు.

========================

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే వెంటనే  సస్పెండ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి ఫిర్యాదులు ఏవైనా ఉంటే కర్నూలు జిల్లా టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 7755కు లేదా, కాల్ సెంటర్ 08518 - 220125 నెంబర్లకు ఫోన్ చేసి తెలియచేయవచ్చని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

========================

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు పక్కాగా ఉండాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈరోజు జిల్లా కలెక్టర్, ఎస్పీ కృష్ణారావుతో కలిసి పీలేరు మండల పరిధిలోని ఎస్.జి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 1,609 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు త్రాగునీరు, నీటి వసతితో విద్యుత్ సౌకర్యం ఉండాలన్నారు. తాసిల్దార్లు, ఈఆర్ఓలు, జిల్లా అధికారులు పోలింగ్ కేంద్రాలను తప్పనిసరిగా సందర్శించి, పాఠశాలలు కళాశాలల్లో అన్ని వసతులు కల్పించాలని అన్నారు.

========================

ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి కోరారు. జిల్లాలోని అతి సున్నిత ప్రాంతంగా గుర్తింపు పొందిన వంగర మండలం కె.లక్ష్మిపేటలో ఓటర్లకు అవగాహనా సదస్సు ఈ రోజు నిర్వహించారు. కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్.పి దీపిక పాల్గొని, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవడంలో జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికావద్దని ఆమె సూచించారు.

========================

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో కేంద్ర సాయుధ బలగాలు తిరుపతి జిల్లాలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. తిరుపతి  పోలీసు సూపరింటెండెంట్ క్రిష్ణకాంత్ పాటిల్ ఆధ్వర్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో కేంద్ర సాయుధ బలగాలు ఈరోజు ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించాయి. తిరుపతి రూరల్ పోలీస్టేషన్ పరిధిలోని చెర్లపల్లి, రేణిగుంట టౌన్, చంద్రగిరి పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించారు.

========================

అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను మే 19, 20, 21 తేదీల్లో నిర్వహించడానికి ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్ళి సింహాచలం నాయుడు, మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్ళి ఉషారాణి అధ్యక్షతన అమ్మవారి ఆలయంలో పురోహితులు సుబ్రహ్మణ్య శాస్త్రి తేదీలను వెల్లడించారు.

========================
========================